క్లుప్తంగా

సాగునీటి కాలువల అభివృద్ధికి చర్యలు



సాగునీటి కాలువను పరిశీలిస్తున్న జేఈ, తదితరులు

ఎల్.ఎన్.పేట: వంశధార కుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న సాగునీటి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవటం జరుగుతుందని వంశధార జేఈ టి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని 5–ఎల్, 7–ఎల్ పిల్ల కాలువలను సోమవారం పరిశీలించారు. కాలువల్లో పూడికల తొలగింపు, గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి బలపర్చటం, కాలువలో నీటి ప్రవాహం ఉన్నప్పుడు గండ్లు పడే ప్రాంతాల్లో సిమెంట్ గోడల నిర్మాణం వంటి పనులు చేపట్టేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. మేజర్ సాగునీటి సంఘాల అధ్యక్షులు గుండపు రాము, కొమరాపు చిరంజీవి తదితరులు ఉన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నరసన్నపేట: మండలంలోని దేశవానిపేట యూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చూపారు. ఐదుగురు విద్యార్థినులు పతకాలు పొందినట్లు హెచ్ఎం జయరామ్ సోమవారం తెలిపారు. అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆలిండియా అండర్ 15 విభాగంలో నెల్లూరులో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు డిసెంబర్ 29న నిర్వహించింది. మహిమా కీర్తి (3వ తరగతి), నేతింటి సామ్యశ్రీ (4వ తరగతి), జోగి అర్చన (5వ తరగతి), ఈగల పూర్ణచంద్ర (6వ తరగతి), యాస్మిన్ (8వ తరగతి) గోల్డ్ మెడల్స్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. డ్రాయింగ్ టీచర్ జవ్వాది రాజేష్ కుమార్‌కు సత్కరించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న చిన్మయి మిషన్ ఇన్‌చార్జి పరమాత్మానంద

నరసన్నపేట: విద్యార్థులు క్రమశిక్షణతోపాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని చిన్మయి మిషన్ సంస్థ నరసన్నపేట కార్యాలయ ఇన్‌చార్జి పరమాత్మానంద స్వామీజీ అన్నారు. స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం చిన్మయి మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం శిక్షణలో భాగంగా లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. చదువుతోపాటు అభిరుచులకు అనుగుణంగా స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. చిన్మయి మిషన్ ప్రతినిధులు శ్రీవత్స చైతన్య, నారాయణ చైతన్య, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



కేజీబీవీని తనిఖీ చేస్తున్న ఏపీసీ శశిభూషణ్

హిరమండలం: పది, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలను సాధించాలని సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ఎస్.శశిభూషణ్ అన్నారు. స్థానిక కేజీబీవీని సోమవారం సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థినులకు పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు వేసి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎస్ఓ ఎస్.కృష్ణవేణి పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త



ఏబీ రహదారి పక్కనే వేస్తున్న చెత్త

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. సుభలయ స్పీడ్ బ్రేకర్ల సమీపంలో అలికాం – బత్తిలి ప్రధాన రహదారి పక్కనే చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను అక్కడ నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రబీపైనే ఆశలు



నాట్లు వేస్తున్న కూలీలు

- కలిసిరాని ఖరీఫ్ వరి సాగు
- ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన పంట
- అన్నదాతను ఆదుకోని కూటమి ప్రభుత్వం



వెదజల్లిన వరి పొలాలు

జలుమూరు:

ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు రైతుకు కలిసిరాలేదు. డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు పంట చాలాచోట్ల పాడైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందిరాకపోవడంతో అప్పులే మిగిలాయి. కూటమి ప్రభుత్వం పెట్టుబడిసాయం కింద అందిస్తామన్న అన్నదాత సుఖీభవ ఇంతవరకు అమలుచేయలేదు. నరసన్నపేట నియోజకవర్గ రైతులు రబీ వరిసాగుపైనే ఆశలు పెట్టుకున్నారు.

పెరిగిన విస్తీర్ణం..

డిసెంబర్ నుంచి వరి వెదలు, ఊభాలు వేయడం ప్రారంభించారు. వెద పద్ధతిలో పెట్టుబడి తక్కువ కావడంతో చాలామంది రైతులు ఈ పద్ధతినే ఎంచుకున్నారు. పొలాలను దమ్ముచేసి నేరుగా విత్తనాలు చల్లుతున్నారు. ఈ ఏడాది మరో 20 శాతం రబీసాగు పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

అనువైన రకాలు..

తేలికపాటి రకాలైన రాజేంద్ర సన్నాలు, నెల్లూరి సన్నాలు, శ్రీధృతి అనువుగా ఉండటంతో రైతులు వీటిపైనే దృష్టి పెడుతున్నారు. పంట కాలం 85 నుంచి 90 రోజులు కావడంతోపాటు దిగుబడి 32 నుంచి 35 బస్తాలు వస్తున్నాయి. ఇందులో ముతక రకం ధరణి, 1010, 1014 సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పుష్కలంగా సాగునీరు..

నరసన్నపేట నియోజకవర్గం పరిధిలోని నరస్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లో ఐదు ఓపెన్ హెడ్ కాలువలు (పోలాకి, లుకులాం, నగిరికటకం, జలుమూరు, మబగాం)తోపాటు మేజర్ కాలవలు సుమారు 26 వరకు ఉన్నాయి. సాగునీటి చెరువులు సారవకోటలో 108, జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల్లో 200 వరకు ఉన్నాయి. ప్రస్తుతం వంశధార నదిలో నీరు పుష్కలంగా ఉంది. చెరువులు, కృష్ణ, రంగ సాగరాలు నీటితో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం రైతులు రబీ వరి సాగులో బిజీ..బిజీ ఉన్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో రబీ వరిసాగు (ఎకరాల్లో) వివరాలు ఇలా..

మండలం	నరసన్నపేట	జలుమూరు	పోలాకి	సారవకోట
సాగు విస్తీర్ణం	1,420	1,561	912	462



భూగర్భ జలాలు పెరిగాయి

ఇటీవల వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. రబీ వరిసాగు గతం కంటే పెరిగింది. కాలువలు, చెరువుల ద్వారా చాలావరకు సాగు అవ్వగా.. మెట్టు ప్రాంతాల్లో కూడా బోర్లు ద్వారా సాగు చేస్తున్నారు. సాగునీటికి ప్రస్తుతం ఎటువంటి ఇబ్బంది లేదు.

– కె.సురేష్‌కుమార్, ఏఓ, జలుమూరు

రైతులును ఆదుకోవాలి



ఈ ఏడాది ఖరీఫ్ ఆఖరిలో వర్షాలు కురవటం వల్ల వరి పంట చాలావరకు పాడైంది. రబీపైనే ఆశలు పెట్టుకున్నాం. గత ఏడాది మూడెకరాల్లో వరి పంట పండించాను. ఈ ఏడాది ఐదెకరాల వరకు వరి, ఇతర పంటలు వేశాను. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులుకు బీమా, రైతు భరోసా అందించి ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ వెంటనే అందించి రైతులును ఆదుకోవాలి.

– ఎం.శ్యామలరావు, రైతు, అల్లాడ

తాగునీరు సరఫరా

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవలాపురం పంచాయతీ వ్యాసులపేటలో తాగునీటి వెతలు పేరుతో ఇటీవల సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, ట్రాన్స్‌కో అధికారులు సోమవారం స్పందించారు. పాడైన విద్యుత్ మోటార్‌ను బాగు చేయించి ప్రజలకు తాగునీటిని సరఫరా చేశారు. సాక్షి పత్రికకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



కుళాయి వద్ద తాగునీటిని పడుతున్న గ్రామస్తులు

క్షీరాభిషేకం



సారవకోట మండలంలోని చీడిపూడి కల్యాణ వేంకటేశ్వర స్వామికి సోమవారం 500 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించారు. ఇక్కడ జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి మూల విరాట్‌కు క్షీరాభిషేకం చేసినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. గ్రామానికి చెందిన నక్క గోవిందరావు, పి.మోహన్‌రావు దంపతులు అభిషేకానికి కావాల్సిన పాలను సమకూర్చారన్నారు. - సారవకోట

నరకయాతన



ఈ చిత్రం సరుబుజ్జిలి అలికాం – బత్తిలి ఆర్‌అండ్‌బీ రహదారిలో చినవెంకటాపురం వెళ్లే పంచాయతీ రహదారి. ఈ రోడ్డులో రాళ్లుతేలిపోవడంతో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోకి 108, 104 వాహనాలు రాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. రహదారి విషయమై పలుమార్లు అధికారులకు వినతులు అందించినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. - సరుబుజ్జిలి

ఇదేనా స్వచ్ఛత?



సారవకోట మండలంలోని వెంకటాపురం పంచాయతీ శివరాంపురం గ్రామంలోని మురుగునీటి కాలువలు చెత్తతో నిండిపోయాయి. చాలా రోజులుగా పూడికలు తొలగించలేదు. కొన్నిచోట్ల మురుగు నీటి కాలువలు పూర్తిగా పాడయ్యాయి. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. పలురకాల వ్యాధులను వ్యాపింపజేసే దోమలు, ఈగలు ఎక్కువగా పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - సారవకోట

గోతులమయం



కొత్తూరు మండలం నివగాం వద్ద పాలకొండ – హడ్డుబంగి రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తోంది. రోడ్డులో గోతులు ఏర్పడటంతో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఇటీవల పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గోతులను పద్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. - కొత్తూరు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



గ్రిగ్స్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలను సోమవారం ప్రారంభించారు. అనంతరం కొత్తూరు కేజీబీవీలో గ్రంథాలయం, కంప్యూటర్ గదులకు శంకుస్థాపన చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎం సువ్వారి నిర్మల, ఎస్ఓ రాధిక, ప్రిన్సిపాల్ రవికుమార్, ఎంపీపీ సవర సావిత్రి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రిగ్స్ విజేతలు వీరే..

మొదటిరోజు జరిగిన అండర్ 14, 17 విభాగాల్లో బాలికలకు పలు క్రీడా పోటీలు, బాలురుకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని 54 పాఠశాలల నుంచి 425 మంది విద్యార్థులు పాల్గొనట్లు పీడీ రాజారావు, హెచ్ఎం సువ్వారి నిర్మల తెలిపారు. అండర్ 17 విభాగం బాలికల్లో కబడ్డీ విన్నర్‌గా పెద్దమడి, రన్నర్‌గా నివగాం, ఖోఖో విన్నర్‌గా చాపర, రన్నర్‌గా పెద్దపద్మాపురం, వాలీబాల్ విన్నర్‌గా కరకవలస, రన్నర్‌గా రావిచంద్రి, బ్యాడ్మింటన్ విన్నర్‌గా పెద్దసీది, రన్నర్‌గా నివగాం, టెన్నికాయిట్‌లో విన్నర్‌గా నివగాం, రన్నర్‌గా పాతపట్నం, బాల్‌బ్యాడ్మింటన్ విన్నర్‌గా పెద్దసీది, రన్నర్‌గా నివగాం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు నిలిచాయి. అండర్ 14 విభాగం (బాలికలు)లో కబడ్డీ విన్నర్‌గా పెద్దమడి, రన్నర్‌గా కడుము, ఖోఖో విన్నర్‌గా కరజాడ, రన్నర్‌గా పెద్దపద్మాపురం, వాలీబాల్ విన్నర్‌గా కడుము, రన్నర్‌గా కొరసవాడ, టెన్నికాయిట్ విన్నర్‌గా గంగువాడ, రన్నర్‌గా నివగాం, బాల్‌బ్యాడ్మింటన్ విన్నర్‌గా పెద్దసీది, రన్నర్‌గా నివగాం, బ్యాడ్మింటన్ విన్నర్‌గా నివగాం, రన్నర్‌గా పెద్దసీది జెడ్పీహెచ్ఎస్ సత్తా చాటాయి. బాలురులో అండర్ 14 విభాగంలో వాలీబాల్ విన్నర్‌గా చాపర, రన్నర్‌గా ఎస్ఎస్‌మనుగు, అండర్ 17 విభాగంలో విన్నర్‌గా చాపర, రన్నర్‌గా గులుమూరు జెడ్పీహెచ్ఎస్ నిలిచాయి.

బాలల హక్కులను పరిరక్షించాలి

- చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం లోగోను ఆవిష్కరించిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తమ్మినేని సీతారాం, తదితరులు

ఆమదాలవలస: బాలల హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం పోస్టర్, లోగోను సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆమదాలవలసలోని తన స్వగృహం వద్ద ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలలపై రాష్ట్రంలో నిత్యం వెలుగులోకి వస్తున్న దాడులు, లైంగిక కార్యకలాపాలను అడ్డుకోవాలన్నారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి మాట్లాడుతూ తమ సంస్థ బాలల హక్కులు, వారి సంక్షేమ సాధనకు నిరంతర పోరాటాలు చేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, మెట్ట మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ బురుజువాడలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న రావాడ ఉయ, జనా సునీతను ప్రత్యేక బృందం సభ్యులు ఆదివారం మద్యం సీసాలతో పట్టుకున్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఇక్కడి సిబ్బంది వారిపై కేసు నమోదు చేయడానికి గ్రామానికి వెళ్లారు. స్థానిక టీడీపీ నాయకుడు వారిపై కేసు నమోదు కాకుండా చేసేందుకు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పోలీస్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. ప్రత్యేక బృందం సభ్యులు పట్టుకుంటే తాము ఏమీ చేయలేమని పోలీస్ అధికారులు తేల్చిచెప్పారు. బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై ఆదివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో హెచ్‌సీ మృతి



హెచ్‌సీ రమణారావు (ఫైల్)



అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న జవాన్లు

పొందూరు: మండలంలోని తోలాపి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బొనిగి రమణారావు (54) సోమవారం స్వగ్రామంలో గుండె పోటుతో మృతిచెందారు. మూడు రోజులు సెలవుపై ఇంటికి వచ్చిన రమణారావు సోమవారం ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లి గుండెపోటుకు గురై పడిపోయారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం రమణారావు ఛత్తీస్‌గఢ్‌లోని సీఆర్‌పీఎఫ్ 16వ బెటాలియన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్నారు. మృతునికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులున్నారు. రమణారావు మృతి చెందిన సమాచారం అందడంతో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అధికారిక లాంఛనాలతో తోలాపిలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

వివేకానందుడు ఆదర్శప్రాయుడు



సాహిత్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న హెచ్ఎం రామకృష్ణారావు

సరుబుజ్జిలి: వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని రొట్టవలస హైస్కూల్ హెచ్ఎం కత్తిరి రామకృష్ణారావు తెలిపారు. ఈ నెల 12న వివేకానందుడి జయంతి పురస్కరించుకుని శారదారామకృష్ణ సేవా సమితి సారథ్యంలో నిర్వహిస్తున్న జాతీయ యువజన వారోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. భారతీయ సాంస్కృతి, సనాతన ధర్మాన్ని వివేకానందుడు ప్రపంచానికి చాటారని గుర్తుచేశారు. వివేకానందుని జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు వివేకానందుడి సాహిత్య పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కన్వీనర్ మందపల్లి రామకృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



సమావేశంలో పాల్గొన్న హెచ్ఎం, ఎస్ఎంసీ సభ్యులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని హెచ్ఎం అల్లాడ ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పంచాయతీ వార్డు సభ్యులు బీఎల్ శర్మ, పేరెంట్ కమిటీ చైర్మన్ డి.హెచ్.బాల మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటిని వెంటనే పూర్తిచేయాలని కోరారు. విలువైన మెటీరియల్ పాడవుతుందన్నారు. అభివృద్ధి పనులను అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు పలువురు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

పాతపట్నం: అనంతపురం జిల్లాలో సీనియర్ న్యాయవాది బి.బి.శేషాద్రి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పాతపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఈ.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పాతపట్నం కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించి, కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ శేషాద్రి మృతిపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. కేసును సీఐడీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో ఎం.గోవిందరావు, రవికుమార్, సుందరరావు, అప్పలనాయుడు, రమణ, దాలయ్య, యుగంధర్ ఉన్నారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం



ఎల్.ఎన్.పేట: కూరగాయలను విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎల్.ఎస్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో పండించిన పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ప్రకృతి వ్యవసాయ మండల యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ పంట దిగుబడుల విక్రయ కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సేంద్రీయ పద్ధతుల ద్వారా పంటలు పండిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకువస్తే వారి పెరటిలో ప్రకృతి వ్యవసాయ పంటలను పండించేందుకు తగిన సూచనలు, సలహాలు తెలియజేస్తామన్నారు. ఎరువులు, పురుగు మందులు వినియోగించటం వలన భూసారం తగ్గిపోతుందన్నారు. ఐసీఆర్పీలు బి.సంతోషి, పూర్ణారావు, ప్రధాన పూజిత, మట్ట రాధిక, తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: ప్రకృతి పంటలను విక్రయిస్తున్న ప్రతినిధులు

జలుమూరులో..

జలుమూరు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు చేయూత ఇవ్వాలని ఇంటర్నల్ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ ప్రతినిధి పట్ట అమరావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలు విక్రయించారు. సేంద్రీయ ఎరువులతో సాగు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. సిబ్బంది సాయమ్మ, మేరి, తదితరులు పాల్గొన్నారు.